మహిళలు- వ్యవసాయం- సామాజిక సమస్యలు అనే అంశంపై ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళలకు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క సామాజిక సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు. రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో దేవదాసీ వ్యవస్థ నేటికి కొనసాగుతోందన్నారు. సామాజిక రుగ్మతల్లో వచ్చిన దాన్ని ఆర్థిక రుగ్మతగా మారిపోయిందన్నారు. కదిరి పరిసర ప్రాంతాల్లో మహిళల అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. ఉపాధి కోసం వెళ్లిన ప్రాంతాల్లో వ్యభిచార కూపంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. భర్త మృతి చెందితే ఆస్తి బదలాయింపు జరగాలన్నా కుటుంబ సభ్యులతో వేదనలు ఎదురౌతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం అన్నారు. భూమి మీద అందరికీ హక్కు లేని పరిస్థితి ఉందన్నారు. మహిళా రైతులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు అందడం లేదన్నారు. ఒంటరి మహిళల జీవన ప్రమాణాలు దుర్భరంగా ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మహిళ సామాజిక భద్రతకు సమాన హక్కులు కల్పించాలన్నారు.

సమగ్రాభివృద్ధికై ప్రణాళికుండాలి

◆ సాగు,తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి ◆ మానవాభివృద్ధికీ చర్యలుండాలి ◆ జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలను ప్రభుత్వాలు రూపొంది, వాటిని అమలుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నాడు అనంతపురం రేడియేంట్ ఫంక్షన్ హాలులో జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును నిర్వహించారు. 'వ్యవసాయం-నీటిపారుదల, పరిశ్రమలు-ఉపాధి, సామాజిక తరగతులు- అభివృద్ధి ఆటంకాలు, విద్యా-వైద్యం నాలుగు అంశాలపై సదస్సు జరిగింది. ఒక్కో అంశానికి సంబంధించి ఆయా రంగాల్లోని అనుభవమున్న వారు ప్రసంగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ చర్చల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై లోతుగా చర్చ జరిగింది.

జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు అన్న సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రత్యేక ప్రణాళికుండాలి

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలను ప్రభుత్వాలు రూపొందించి అమలు జరిపినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రారంభోన్యాసం చేశారు. ప్రభుత్వాలు అభివృద్ధి అన్న దానికే అర్థాలు మార్చేస్తున్నాయని చెప్పారు. తలసరి ఆదాయన్ని చూపించి అదే అభివృద్ధి అని చెబుతున్నాయన్నారు. ఆ రకమైన ఆర్థికాభివృద్ధి చూసినప్పుడు అది ధనవంతులు, పెట్టుబడిదారుల అభివృద్ధిగానే ఉంటోందన్నారు. ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి జరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ముందుకుపోతున్నా మానవాభివృద్ధిలో ఇప్పటికీ ఎంతో వెనుకబడి ఉందని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూసినప్పుడు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక 77వ స్థానంలో ఉండగా భారతదేశంలో 133వ స్థానంలో ఉందని చెప్పారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, తదితర అంశాలన్నీ మానవాభివృద్ధి సూచికలోకి వస్తాయన్నారు. సమాజంలోని అన్ని తరగతుల అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని వివరించారు. ఇక రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రాభివృద్ధి మరింత కుంటుపడిందని విచారం వ్యక్తం చేశారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్నది కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాలకు లక్ష కోట్ల రూపాయల ప్యాకేజీనివ్వాలని డిమాండ్ చేశారు.

నీటి వనరుల అనుసంధానం అవసరం

ఎస్ఎం.బాషా

అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు సాగు,తాగునీటి వనరులను తీసుకు రావడంతో పాలకులు ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని నీటి రంగ నిపుణులు ఎస్ఎం.బాషా విమర్శించారు. ప్రతిపక్షంలోనున్న సమయంలో ప్రతి పార్టీ కూడా జిల్లాలో ప్రతి ఎకరానికి నీటిని అందిస్తామని హామీలిచ్చి మోసం చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై ఆయా పార్టీలు, నాయకులను నిలదీయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ప్రశ్నించనప్పుడే జిల్లాకు సాగునీటి వనరులను రాబట్టుకోగలమని చెప్పారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా ప్రాజెక్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల నీటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. తుంగభద్ర, హంద్రీనీవా నీటిని జిల్లాలోనున్న చెరువులు, నీటి వనరులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా కరువును తట్టుకునేందుకు వీలు ఏర్పడుతుందని సూచించారు.

పంటల సరళిలో అనేక మార్పులు

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

సదస్సులో భాగంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఈ సందర్భంగా విశ్లేషించారు. జిల్లాలో పంటల సరళిలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. మొదట ఆహార పంటలు అధికంగా ఉంటే 1990 దశకం నుంచి వేరుశనగ పంట ప్రధాన పంటగా జిల్లాలో మారిందన్నారు. ఇప్పుడు అది పోయి పండ్లతోటల సాగు గణనీయంగా పెరుగుతోందని వివరించారు. మారుతున్న పంటల సరళికి అనుగుణంగా తగిన ప్రోత్సహాకాలను ప్రభుత్వాల వైపు నుంచి ఉండటం లేదని తెలిపారు. పండ్లతోటల సాగుకు అవసరమైన ప్రోత్సహాకాలను ప్రభుత్వాలు నిలిపివేసాయన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ రంగానికి రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రోత్సహకం సహకారం అందించే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు

క్యాస్ట్రో కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్

సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు అన్న అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాస్ట్రో కిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. దీన్ని అందిపుచ్చుకోవడానికి ఇతర రంగాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు కూడా ఐటి రంగంలో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పూర్తి స్థాయి సాంకేతిక అందిపుచ్చుకోకుండా అడుగు పెట్టడం ద్వారా కొన్ని ఇబ్బందులూ ఎదుర్కొనే పరిస్థితులుంటున్నాయి. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో విద్యాలయాల్లోనూ క్వాలిఫైడ్ అధ్యాకుల్లేకుండా కోర్సులను పూర్తి చేయిస్తున్నారన్నారు. ఇది కూడా ఐటి రంగంలోకి అడుగుపెట్టే వారికి సమస్యలను ఎదుర్కొనేలా చేస్తోందన్నారు. ఇలాంటి వాటిని ప్రభుత్వాలు పరిష్కరిస్తే ఉపయోగంగా ఉంటుంది.

సబ్‌ప్లాన్‌కు ప్రణాళిక అవసరం

సత్యబోస్

దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం నిధులు కేటాయింపులు చేశారో, ఆ నిధులన్ని పూర్తిగా వారి కోసమే ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ సత్యబోస్ అన్నారు. సామాజిక తరగతులు- అభివృద్ధి- ఆటంకాలు అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా సత్యబోస్ మాట్లాడారు. సబ్‌ప్లాన్ కేటాయింపులు చేస్తున్న ఖర్చు మాత్రం మొత్తం చేయలేదన్నారు. సబ్‌ప్లాన్ అమలు పర్యవేక్షణ యంత్రాగం తప్పనిసరిగా ఉండాలన్నారు. మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఆర్థిక ఆదాయ వనరులు పెరగాలన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయం అవకాశాలు కల్పించాలన్నారు. నిధులు ఎలా ఖర్చు చేయాలో డేటా రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్స్ పంపించి నిధులు రాబట్టే విధానం రావాలన్నారు. ప్రత్యేకంగా కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా వారి కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళకు సామాజిక భద్రత కల్పించాలి

రెడ్స్ సంస్థ అధినేత్రి భానుజ

మహిళలకు అన్ని రంగాల్లో సామాజిక భద్రత కల్పించాలని రెడ్స్ సంస్థ అధినేత్రి భానుజ అన్నారు.

కార్పొరేట్ విద్యను వ్యతిరేకించాలి

ఏ.చంద్రశేఖర్

అశాస్త్రీయమైన గ్రేడింగ్ విధానాలతో విద్యార్థులను మానసి స్థితిగతులను దెబ్బతీసేలా ఉన్న ర్యాంకుల పోటీ అనుసరిస్తున్న కార్పొరేట్ విద్యా వ్యవస్థను ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే ప్రభుత్వ విద్య బాగుపడుతుందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ఏ.చంద్రశేఖర్ తెలిపారు. విద్యా- వైద్యం అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జిల్లాలో విద్యా రంగం పరిస్థితి- ప్రభుత్వ విద్య అవశ్యకత అంశం ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. సమర్థవంతులైన ఉపాధ్యాయ, అధ్యాపకులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్నప్పటికీ ప్రయివేట్ రంగంలోనే అడ్మిషన్‌లు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్శిటీల్లో సీట్లు మిగిలిపోతున్నాయని తెలిపారు. జిల్లా నుంచి వేల మంది విద్యార్థులు విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో డబ్బులు వెచ్చించి చదివే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్కెయు, సెంట్రల్ యూనివర్శిటీ, జెఎన్‌టియుల్లో అడ్మిషన్‌లు తగ్గిపోతున్న పరిస్థితి ఉందన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజా వైద్యురాలు డాక్టర్ ప్రసూన

ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకు సరిపడా వైద్యులు, సిబ్బంది, పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజా వైద్యురాలు డాక్టర్ ప్రసూన తెలిపారు. జిల్లాలో వైద్యం- ప్రజల పరిస్థితి- ప్రభుత్వ వైద్యం అవశ్యకత అంశంపై ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం మంది ప్రభుత్వం వైద్యం మీద ఆధారపడ్డారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నా పెద్ద ఆసుపత్రులన్నింటినీ బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రులు ఉండటం గర్వకారణం అన్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, టెక్నీషియన్‌లు, సిబ్బంది, పోస్టులు భర్తీ చేయాలన్నారు. చిన్న సమస్యలతో నిలిచిపోయిన యంత్రాలను బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సబ్ సెంటర్‌లు, పిహెచ్‌సిలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో వైద్యులు అందుబాటులో ఉంచి వైద్య సేవలు మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వాలను కదిలించేందుకు ప్రజా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి

సామాజిక వేత్త ఎం.ఇలియాజ్

ప్రభుత్వ రంగాలు, శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని సామాజిక వేత్త ఎం.ఇలియాజ్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు- పోటీ పరీక్షలు- సామాజిక సమస్యలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఇస్తున్న హామీలు అమలుకు పొంతన లేకుండా పోతున్నాయని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ఎన్నికల మ్యానిఫెస్టోగా మారిపోతున్నాయి తప్పా నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పాలకులు తెలివిగా ప్రయివేట్ కంపెనీలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నామని ఊదరగొడుతున్నారని, ప్రయివేట్ ఉద్యోగాల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. ఎపిపిఎస్సీ నోటిఫికేషన్‌ను అభ్యర్థులు మరిచిపోయే పరిస్థితి ఉందన్నారు. లక్షల్లో పోటీ ఉంటే వందల సంఖ్యల్లో పోస్టులకు నోటిఫికేషన్‌లు ఇస్తున్నారని తెలిపారు. బ్యాక్‌లాక్ పోస్టుల ఊసే లేదన్నారు. ప్రభుత్వాలు తమ బాధ్యతను నిర్వర్తించి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.5 వేలు ఇవ్వాలన్నారు. గ్రూప్స్1, 2 పోస్టులు ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. పోటీ పరిక్షల కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు.

ప్రోత్సాహకాలు అవసరం

బావయ్య, ప్రొఫెసర్

సదసుస్సులో భాగంగా పరిశ్రమలు- ఉపాధి అంశంపై ప్రొఫెసరు బావయ్య ప్రసంగించారు. కోవిడ్ సమయంలో చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. వీటిని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక పథకాలను ప్రభుత్వ స్థాయిలో తీసుకు వచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. అయితే వీటి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. అవగాహన కల్పించకుంటే వీటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలియజేశారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

◆ ప్రయాణికుల భద్రతకు పెద్దపీట ◆ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంతో సురక్షితం అని, సమయానికి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆర్టీసీ అతిపెద్ద సంస్థగా రవాణా రంగంలో నిలిచింది. మారుతున్న కాలానుగుణంగా ఆర్టీసీలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రయివేటు వాహనాల్లో కిక్కిరిసిన ప్రయాణికులతో పాటు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రయాణం క్షేమం' అని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ తెలియజేశారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : సత్యసాయి జిల్లాలో ఎన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి.? డిపోలు ఎన్ని.? సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు

డిపిటిఒ : జిల్లాలో మొత్తం 397 బస్సు సర్వీసులు ఉన్నాయి. కొత్త జిల్లాలో ఆరు డిపోలు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, హిందూపురం డిపోలు ఉన్నాయి. 1600 మంది సిబ్బంది పని చేస్తున్నారు. సిబ్బంది కొరత లేదు. పుట్టపర్తి డిపోలో 50 బస్సులు ఉన్నాయి.

ప్రశ్న:కొత్త బస్సులు రానున్నాయా? జిల్లా కేంద్రానికి నూతన బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారా?

డిపిటిఒ : కొత్తగా 42 అద్దె బస్సులు రానున్నాయి. అవసరమైన డిపోలకు వాటిని సర్దుబాటు చేస్తాం. అన్ని డిపోల నుంచి లింకు సర్వీసులు ఉన్నాయి. కదిరి, ధర్మవరం డిపోల నుంచి చాలా సర్వీసులు తిరుగుతున్నాయి. పెనుకొండ, హిందూపురం డిపోల నుంచి కొత్తచెరువు లింకు సర్వీసులు ఉన్నాయి. మడకశిర నుంచి ఒక్క సర్వీస్‌ను నడుపుతున్నాము. గోరంట్ల నుంచి ఒక్క సర్వీస్‌ను పుట్టపర్తికి నడుపుతున్నాం. పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు మండల కేంద్రం నుంచి కూడా ఒక సర్వీస్‌ను నడుపుతున్నాం. జిల్లాలో ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి మేరకు బస్సు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: బెంగళూరు, ఇతర నగరాలకు సరిపడ సర్వీసులు ఉన్నాయా.?

డిపిటిఒ : వైట్ ఫీల్డ్‌కు ఒక సర్వీస్ ఉంది. ఇటీవలనే బెంగళూరుకు మరొక బస్సును వేసాం. విజయవాడ, ఒంగోలు, తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌కు సర్వీసులు ఉన్నాయి. బెంగళూరుకు ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులు నడుపుతాం.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా రోజు ఎన్ని కిలోమీటర్లు సర్వీసులు నడుస్తాయి.? రాయితీల మాటేమిటి.?

డిపిటిఒ : జిల్లా వ్యాప్తంగా రోజూ సుమారు 1.50 లక్షల కిలోమీటర్లు బస్సు సర్వీసులు నడుస్తాయి. దాదాపు లక్ష మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. గతంలో క్యాట్ కార్డులు, వనిత కార్డులు లాంటి రాయతీలను సంస్థ రద్దు చేసింది. సిటిజన్స్ మాత్రం 25 శాతం రాయితీతో జర్నలిస్టులకు ఉచిత పాసులు, విద్యార్థులకు రాయితీతో పాసులు మంజూరు చేస్తున్నాం. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను దష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నాం.

ప్రశ్న: కాలం ముగిసిన సర్వీసులు నడుపుతున్నారనే వాదన పై మీ అభిప్రాయం.?

డిపిటిఒ : కాలం ముగిసిన బస్సులను నడిపే ప్రసక్తే లేదు. ఒక్కో బస్సు 15 ఏళ్ల సర్వీస్ ఉంటుంది. ప్రతి డిపోలోను గ్యారేజీ ఉంటుంది. డ్రైవర్ బస్సు దిగగానే బస్సు కండిషన్ ఎప్పటికప్పుడు గ్యారేజీ వారికి రిపోర్ట్ చేస్తాడు. దానికి అనుగుణంగానే వెంటనే మరమ్మతులు చేయడానికి ప్రత్యేక మెకానిక్‌లు ఉన్నారు. ప్రతిరోజూ జరిగే ప్రక్రియ ఇది. ఎప్పటికప్పుడు బస్సులు కండీషన్‌లో ఉంచడానికే చర్యలు తీసుకుంటన్నాం.

మధుసూదన్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

ప్రశ్న:నూతన జిల్లాలో ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు.? ప్రయాణికులకు మీరిచ్చే సలహా ఏమిటి?

డిపిటిఒ : గత నెలలో 12 కోట్లు ఆదాయం ఉంటే ఒక నెలలోనే రెండు కోట్లు ఆదాయం పెరిగింది. సంస్థ ఇంకా నష్టాల్లోనే ఉంది. దీనిని అధిగమించడానికి కషి చేస్తున్నాం. ఇంధన పొదుపు పాటించడం, 5.30 కెఎంపిఎల్ నుంచి 5.50 కెఎంపిఎల్ ఆదాయం తెచ్చి ప్రతిభ చూపుతున్న డ్రైవర్లు, కండెక్టర్లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నాం. ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితమైనదని, సమయపాలన పాటిస్తూ సమయానికి గమ్యస్థానం చేరుకునేందుకు అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా ఆర్టీసీలోనే ప్రయాణించాలని సూచిస్తున్నాం. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా కార్గో పార్సిల్ సర్వీసులు ప్రారంభించాం. 84 డిపోల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం ఉంటుంది. ప్రజల పార్సిళ్లను వారి ఇంటికే చేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. శుభకార్యాలకు బస్సులు పంపుతామన్నామని, ప్రజలు దీనిని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

లేపాక్షి ఆలయంలో రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వెంకటేశ్వరరావు

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్

లేపాక్షి : స్థానిక దుర్గావీరభద్ర, పాపానేశ్వర నంది ఆలయాలను ఆదివారం రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు తహశీల్దార్ బాబు స్వాగతం పలికారు. అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. ఆ తరువాత ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలోని శిల్పకళలు, ఏకశిల నంది విగ్రహం, లేపాక్షి తైల వర్ణ చిత్రం, వేలాడే స్తంభం ఆకట్టుకున్నాయన్నారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ జయలక్ష్మి, విఆర్ఒ రమేష్, అర్చకులు శీనస్వామి, తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణ

పెనుకొండ : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో 3 నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.వంశీకృష్ణభార్గవ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కల్గిన వారు పెనుకొండ పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈ నెల 30వ తేదీ లోగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ 96767 06976 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే శంకరనారాయణ గుట్టూరు గ్రామ పంచాయతీకి చెందిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు. అలాగే అనారోగ్య సమస్యలతో పలు ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితురాలు పరిగి మండలంలోని కొడిగెనహళ్లి బిందునగర్‌కు చెందిన దేవరాజు కుమార్తె కె.చేతనకి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 3.5లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి, జడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

కె.శివరం ఎస్సీ కాలనీలో మురుగుకంపు

ప్రజాశక్తి-అమరాపురం

మండల పరిధిలోని కె.శివరం ఎస్సీ కాలనీలో చెత్తచెదారం పేరుకుపోయి నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దానిని భరించలేకపోతున్నామని ఎస్సీ కాలనీ మహిళలు వాపోతున్నారు. గ్రీన్ అంబాసిడర్లకు కొన్నేళ్ల నుంచి వేతనాలు అందకపోవడంతో వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదని దీంతో చెత్త చెదారం పేరుకుపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శి శర్మకు ఫోన్ చేయగా కాలయాపన చేస్తున్నారే కానీ శుభ్రం చేయించలేదని మండిపడ్డారు.

చెకుముకి సంబరాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా జెవివి జిల్లా అధ్యక్షులు మహేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి సంబరాలు సైన్స్‌కి సంబంధించిన టాలెంట్ టెస్ట్ అని, శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థుల్లో జీవన విధానాన్ని అలవర్చుకొనేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. కావున పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎ.హరి, జోన్ కన్వీనర్ నబి, పెనుకొండ జోన్ కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, ఇమ్రాన్, చంద్రశేఖర్‌రెడ్డి, పోతన్న, ఘనగిరి పాఠశాల కరస్పాండెంట్ ఇలియాస్, సభ్యులు జుహూర్, నారాయణస్వామి, కోగిర జయచంద్ర, రమేష్, డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జయప్ప, జబివుల్లా, ఇలియాస్, బాబా, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

నేడు స్పందన

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన గ్రీవెన్స్ సోమవారం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు._ స్పందన కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం చేపడతామని ప్రజలు వారి వారి సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ అర్జీతోపాటు ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబరు అందజేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు రాంనగర్ లో గల శ్రీ కోదండ రామాలయం దేవాలయంలో ఆదివారం సేవా భారతి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా వైద్యశిబిరం నిర్వాహకులు తిరుమలేశు, నరేష్ బాబు, దాసరి రామన్న, రవీంద్ర దాస్ మాట్లాడుతూ పక్షవాతానికి ప్రత్యేక వైద్య నిపుణులు వైద్యచికిత్సలు, సలహాలు, సూచనలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో గురూజీ శిష్యులు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ధర్మవరం టౌన్ :పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీలో గల శివాలయ అభివృద్ధికి 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబులమ్మ, ఆమె భర్త వార్డ్ ఇంచార్జ్ డోలా రాజారెడ్డి విరాళం అందజేశారు. ఈ మేరకు పదివేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా శివాలయ అర్చకులు, కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను అడ్డుకుంటాం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో నవంబరు 4న తలపెట్టిన సామాజిక సాధికారిక బస్సు యాత్రను అడ్డుకుంటామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తుంపర్తి పరమేశ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక ఎస్సీ, ఎస్టీలను మోసం చేశారని విమర్శించారు. ఎస్సీలకు గతంలో వస్తున్న పథకాలను రద్దుచేయడంతోపాటు విదేశీ విద్య తదితర వాటిని రద్దుచేశారన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

చిలమత్తూరు : మండల కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి ప్రతిమను మండల కేంద్రంలోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి సంధ్య, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత విఆర్‌ఒ మృతి

రొద్దం : మండల కేంద్రమైన రొద్దం గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ రామకృష్ణ(66) అనారోగ్యంతో వారం రోజుల నుంచి హైదరాబాద్‌లోని బసవతారక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

బత్తలపల్లి : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఇఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంఇఎఫ్ నాయకులు నాగరాజు, ఎమ్మార్పీఎస్ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు బుదెప్ప కోరారు. ఈ మేరకు వారు ఆదివారం మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి. సంజీవపురం ఎస్సీకాలనీల్లో 'విశ్వరూప మహాసభ ఛలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి పాముల పెద్దన్న, గంటాపురం కాటమయ్య, పూజారి పెద్దన్న, జయరాం, రామాంజి. నారాయణ, మోహన్, పోట్లమర్రి రాజశేఖర్, రమేష్, నిరంజన్ ఇతర మహిళా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హిందూపురం : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఆంజినేయులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి ఆంజినేయులు నివాసానికి వెళ్లి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తేదారుడు భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో రక్తదాన శిబిరం

పెనుకొండ : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఎంక్యూఎ గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం పెనుకొండ పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా పోలీసులతో పాటు స్థానిక ప్రజలు రక్తదానం చేశారన్నారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని, యువత ఈ విషయాన్ని అవగాహన చేసుకొని విరివిగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐలు రాజారమేష్, సుబ్బరాయుడు, సురేష్, ఎస్ఐలు రాజేష్, రమేష్ బాబు, విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలిచ్చే వరకూ పోరాటం

పేదల గుడిసెల వద్ద మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని 805 సర్వేనెంబర్ జగనన్న లే అవుట్ లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం కొనసాగుతుందని సిఐటియు జిల్లా నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. పేదలు గుడిసెలు వేసుకొని ఆదివారానికి 41 రోజులు అయిన సందర్భంగా నాయకులు గుడిసెలను సందర్శించారు. పేదలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్నపాటి ఇళ్లలో రెండు మూడు కుటుంబాలు ఉంటాయన్నారు. అలాగే అద్దె ఇళ్లలో ఉంటూ బాడుగలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం లబ్దిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకోవాడం దారుణమన్నారు. వివాదస్పద భూముల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం వెనుక అంతర్యం ఏమిటో అంతుపట్టడం లేదన్నారు. ఎలాంటి వివాదం లేకుండా పేదలకు ఇంటి నిర్మాణం కు అనువైన 805 సర్వే నెంబర్‌లోనే కలెక్టర్ ఇచ్చిన హామీని అమలు చేసి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ, రామచంద్ర, సదాశివరెడ్డి, రహమతుల్లా, శివ, యుఎల్ నరసింహ, వేణు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువు లోని ఎస్సీ కాలనీ, ధర్మవరం రోడ్డు, దర్గా కాలనీ, బుక్కపట్నం రోడ్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కారక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలుగా చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అందుకు సంబందించిన కరపత్రాలను అందజేశారు. గ్రామపంచాయతీలో పారిశుధ్యం, తాగునీరు, కల్వర్టుల మరమ్మతులు, విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో సర్పంచి, కార్యదర్శి పర్యవేక్షించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇంటి పట్టాలు అందలేదని పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచి రాధా నాగరాజు, ఎంపీపీ భర్త రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, శ్యాంసుందర్ రెడ్డి, షాజహాన్, సోమశేఖర్ రెడ్డి, ఎల్లప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న మహిళ

కళ్లకు గంతలతో తెలుగు తమ్ముళ్ల నిరసన

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ఆదివారం అనంతపురం నగరంలోని తన నివాసం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని రోడ్డు మీదకు వచ్చి సైకో పోవాలి నిజం గెలవాలి అని నిరసన తెలిపారు. పార్థసారథి మాట్లాడుతూ నిజం గెలవాలి చంద్రబాబుకి వేసిన సంకెళ్లు బద్దలు కావాలి, అది జరగాలంటే జగన్‌కు కనువిప్పు కావాలనే ఇలా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్య చౌదరి, మహమ్మద్‌గౌస్, పోతులయ్య, సద్దల చెన్నప్ప, గంగలకుంట కృష్ణ, అశ్వర్థ, బ్యాళ్ల నాగేంద్ర, కోరే విశ్వనాథ్, కరే మురళి, కొండప్ప, నంబూరి రమణ, కప్పల నరేష్, నవోదయ కాలనీ పవన్, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద రాత్రి నిజం గెలవాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ రవిశంకర్, నాయకులు కన్నా స్వామి, శ్రీనివాసులు, హుజూర్, సాయిప్రసాద్, రామలింగ, షౌకత్, జావిద్, హరి, ఆవుల నరేంద్ర, బోయ అనిల్‌కుమార్, షీప్ ఫారం చంద్ర, బాలునాయక్, వాజిద్, నాని, శంకర్, షీప్ ఫారం శీన, జగదీష్, శివ పాల్గొన్నారు.

నిజం గెలవాలి జగన్‌కు కనువిప్పు కావాలి : సవిత

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా 'సంకెళ్లు బద్దలు కావాలి అది జరగాలంటే జగనాసురునికి కనువిప్పు కావాలి' అంటూ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయం వద్ద నిజం గెలవాలి జగన్‌కు కనువిప్పు కలగాలని కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, డివి ఆంజనేయులు, శ్రీరాములు, త్రివేంద్రనాయుడు, ప్రసాద్, రమణమ్మ, సుబ్రహ్మణ్యం, మారుతిప్రసాద్, బాబుల్‌రెడ్డి, మంజునాథ్, ప్రకాష్ నిసార్, రవి, గోవిందు పాల్గొన్నారు.

మడకశిర : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆదివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు 'కళ్ళు తెరిపిద్దాం గట్టిగా నినదించి' కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకొని నల్ల బ్యాడ్జీలు ధరించి వీధులు, బాల్కనీలు, ఇళ్ల ముందు నిరసన వ్యక్తం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మనోహర్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మల్లికార్జున, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, ఉమాశంకర్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్.గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, జడ్పిటిసి ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : 'నిజం గెలవాలి సిఎం జగన్‌కు కనువిప్పు కలగాలి' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టు దుర్మార్గమని, నిజం గెలవాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పార్థసారథి వర్గం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అశ్వత్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, ఎల్ఎన్.నారాయణస్వామి, బాలకృష్ణచౌదరి, మల్లికార్జున, శ్రీనివాసు లు, జయరాం, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి ప్రభుత్వం వేధిస్తోందనిటిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు మండలకేంద్రంలోనిఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు ఆదివారం రాత్రి కళ్లకు గంతలు కట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నాగేంద్ర ప్రసాద్, సైకిల్‌షాప్ బాబా, ఆలకుంట శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం :చంద్రబాబు నాయుడు నిజాయితీని నిరూపించి నిజాన్ని గెలిపిద్దామనిటిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో టిడిపి నాయకులు కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, వాజిద్, నారాయణస్వామి, శ్రీరాములు, షామీర్‌బాషా, సామకోటి ఈశ్వరయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు

తలుపుల : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు స్థానిక మూడు రోడ్ల కూడలిలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దులరాముడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తిరుపాలు, తుమ్మల సూరి, నారాయణస్వామి, గడ్డం మోహన్, సుబ్బారాయుడు, గాజుల చంద్ర, తుమ్మల చంద్ర, ఆంజనేయులు, అబ్దుల్ రజాక్, క్రిష్ణ, వీరనారప్ప, దాదు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. నేరం నిరూపించకుండానే 51 రోజులుగా కేవలం ఆరోపణలు చేస్తూ చంద్రబాబును అరెస్టు చేసి జగన్ కక్ష సాధింపు చర్యలు చేపట్టాడని విమర్శించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

ధర్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కావలిలో ఆర్టీసీబస్సు డ్రైవర్‌పై దాడిచేసిన తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కేబీ నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా ఆదివారం ధర్మవరం ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ రీజనల్ నాయకులు నరసింహులు, బిల్లే ఆదినారాయణ, డిపోకార్యదర్శి ముస్తాఫా, బాబు, సూరీడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్ఎంయూ జోనల్ నాయకులు ప్రేమకుమార్, సత్యసాయిజిల్లా చైర్మన్ ముత్యాలప్ప, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, మధు గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు హరి, కుమార్ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు..

కదిరి టౌన్ :నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై దాడి హేయమైన చర్య అని కదిరి ప్రైవేట్ బస్సుల యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్‌పై దాడులు జరుగుతుంటే సామాన్యులకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రవేటు బస్సుల యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్‌కు మద్దతుగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

హిందూపురం : ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్‌టిసి కార్మికులు డిమాండ్ చేశారు. కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసనగా యూనియన్లకు అతీతంగా కార్మికులు, ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి గ్యారేజ్ నుండి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రసాద్, నారాయణ స్వామి, ఎన్ఎంయు గౌరవ అధ్యక్షులు శివశంకర్, నాయకులు రాజారెడ్డి, వైఎస్‌ఆర్ యూనియన్ బాబాజాన్, రవి మాట్లాడుతు ఆర్టీసీ డ్రైవర్ల పై దాడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి యూనియన్ల నాయకులు మల్లికార్జున, జిలాన్, ప్రతాప్, రూపేంద్ర, వేంకటేష్, బాషా, సంజీవప్ప, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ :కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడిని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఖండించారు.కదిరి డిపో గ్యారేజ్ గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నబి రసూల్, జిల్లా కార్యదర్శి జివైపి. రావు, రీజినల్ సివిపి ఆర్ఎస్ రెడ్డి, డిపో కార్యదర్శి శంకర్, గ్యారేజ్ కార్యదర్శి రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :నెల్లూరు జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వైసిపి సైకోలను కఠినంగా శిక్షించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం సవితమ్మ మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా ఉన్న బైక్ తీయమని హారన్ కొట్టడం, అడగటం డ్రైవర్ చేసిన తప్పా అని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులపై దాడి చేయడం అంటే వ్యవస్థ మీద దాడి చేయడమే అన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర డిజిపి, పోలీస్ వ్యవస్థ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. పోలీసులు వైసిపి కార్యకర్తల్లా పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయా ఘటనలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, డివి ఆంజనేయులు, శ్రీరాములు, సూర్యనారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, త్రివేంద్రనాయుడు, బాలాజీ నాయక్, మూర్తి పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ :నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌ను కొందరు రౌడీలు అమానుషంగా కొట్టడాన్ని ఎఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. రాష్ట్రంలో రౌడీల పాలన కొనసాగు తోందని, ఎపిని మరో బీహార్‌లాగా మారుస్తున్నారని ఆరోపించారు. అలాగే గోరంట్లలో ఇటీవల కాలంలో రౌడీలు పేట్రేగిపోతున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు తెగపడుతున్నారని, పాత్రికేయుడిపై దాడి జరిగినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇలాంటి రౌడీలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నాయకులు సుధాకర్, సురేష్‌బాబు, వెంకటేష్, బాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

DHARMAVARAM MUNICIPALITY

IFB Tender Notice No.278,279,280,406,407, 462 & 463/General Funds/2023-24/E1.

'c' procurement Tender Notice No.278,279,280,406,407, 462 & 463/General Funds/2023-24/El under General Funds 2023-24 With value of work Rs. 4.95 Lakhs to Rs.40.00 Lakhs & Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD Datails etc., may be seen on 'e' procurement website -https://tender.apeprocurement.gov.in.

Commissioner,
Dharmavaram Municipality.

తడిపంటగా మారిన కందిపంట

ప్రజాశక్తి రొద్దం

తీవ్ర వర్ష భావంతో జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. అయితే రైతు మాత్రం తన శ్రమనే నమ్ముకొని జీవిస్తున్నాడు. ఎండిన పంటలు ఎలాగైనా కాపాడుకోవాలని నానా అవస్తలు పడుతున్నాడు. ఇందులో భాగంగా రొద్దం గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తనకున్న 3ఎకరాలు పొలంలో లక్ష రూపాయిలు ఖర్చు చేసి కందిపంట సాగు చేశాడు. వర్షం రాకపోవటంతో పంట ఎండుతోంది. అయినా రైతు కుంగిపోకుండా కంది సాళ్లకు కాలువలు చేసి పక్కన ఉన్న మరొక్క రైతు బోరులో నీటిని పైపులు ద్వారా పంటకు అందిస్తున్నాడు. అయితే నీరు అందుబాటులో ఉన్న రైతు ఇలా చేస్తుండగా మరికొంతమంది ట్యాంకర్ల ద్వారా నీటికి వదిలి పంటను కాపాడుకొంటున్నారు.

నేరాలు ఘోరాలు

పాత్రికేయుడిపై దాడి చేసిన నిందితులు అరెస్టు

పెనుకొండ : గోరంట్ల పట్టణంలో పాత్రికేయుడిపై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. బాధిత పాత్రికేయుడు ఈశ్వర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గోరంట్ల సిఐ ఎం.సుబ్బరాయుడు, పెనుకొండ సిఐ రమేష్, ఎస్ఐలు 3 బృందాలుగా విడిపోయి గాలించారన్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నలుగురు నిందితులను సిఐ సుబ్బరాయుడు పెనుకొండ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అరెస్టు చేశారన్నారు. నిందితులందరూ ధర్మవరం వాసులే అన్నారు. ధర్మవరం పట్టణంలోని సారధినగర్‌కు చెందిన లేట్ రాజన్న కుమారుడు సింగరాజు, లేట్ నారాయణస్వామి కుమారుడు నీలూరి రమేష్, గాంధీనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు ఎం. చక్రవర్తి అలియాస్ చక్రి, రాజేంద్రనగర్‌కు చెందిన లేట్ కంసల ధర్మాచారి కుమారుడు కంసల శంకరాచారి అలియాస్ శంకరగా గుర్తించినట్లు తెలిపారు. ఈ నలుగురూ స్నేహితులని, గొడవలు, చోరీలు, హత్య కేసుల్లో నేరచరిత్ర కలిగి ఉన్నారన్నారు. వీరి స్నేహితుడైన శీన ధర్మవరం పట్టణానికి చెందిన శివకు ఏడాది క్రితం రూ. లక్ష అప్పుగా ఇచ్చాడన్నారు. ఆ తర్వాత శీన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగ్గా శివ వాయిదాలు వేస్తూ కాలయా పన చేశాడన్నారు. ఈ విషయంలో ఐటిడిపికి చెందిన నరేష్ శివకు మద్దతుగా నిలిచాడన్నారు. 6 నెలల క్రితం నిందితులు నలుగురూ క్రికెట్ బెట్టింగ్ డబ్బుల విషయంలో నరేష్‌పై దాడి చేశారన్నారు. ఆ విషయంలో నరేష్ బంధువు అయిన గోరంట్ల వాసి పాత్రికేయుడు ఈశ్వర్ చక్రికి ఫోన్ చేసి రెచ్చగొట్టాడన్నారు. దీంతో వారు గోరంట్ల వచ్చి ఈశ్వర్‌పై దాడి చేశా పారిపోయారని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

అమరాపురం : మండల పరిధిలోని కాచికుంట గ్రామానికి చెందిన యాదవ సవిత(45) ఆదివారం ఉదయం ఇంటి ఆవరణలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఇంటికి పై భాగంలో వేసిన ఇనుప రేకులకు విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ విషయం తెలియని సవిత బాత్రూంలో స్నానం చేస్తుండగా చుట్టూ ఉన్న రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరింది. దీంతో భర్త, బంధువులు హుటాహుటిన ఆమెను అమరాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మడకశిరకు వెళ్తుండగా సవిత మృతి చెందింది. భర్త శివన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మల్బరీ తోటపై విష ద్రావకం పిచికారీ

రొద్దం : మల్బరీ తోటపై గుర్తుతెలియని వ్యక్తులు విష ద్రావకం పిచికారి చేసినట్లు బాధితుడు వాపోయారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన వడ్డే నాగరాజు మల్బరీ తోటపై గుర్తు తెలియని వ్యక్తులు విష ద్రావకం పిచికారి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తన మల్బరీ పంట 3వ జ్వరంతో ఉన్న రేషం పురుగులు విష ద్రావకం పిచికారి చేసిన ఆకు తిని మృతి చెందాయని, దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. రాగిమేకలపల్లిలోని అద్దె షెడ్డులో రేషం పురుగులు మేపుతుండగా ఇలా జరిగిందని రైతు వాపోయాడు. కొన్ని నెలల క్రితం మండలంలోని మరో గ్రామంలో కూడా ఇలాంటి సంఘటనే నెలకొందని తెలిపారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

బత్తలపల్లి : అందరి కళ్లలో చెప్పలేని ఆనందం, చిన్ననాటి మిత్రులను కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు. అందరూ తమ కుటుంబ సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులు, తారతమ్యాలు అన్నీ మరిచిపోయారు. ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆత్మీయంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటూ చిన్ననాటి తమ జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 1993–91లో పదవ తరగతి బ్యాచ్‌లో 180 మంది విద్యార్తులు చదువుకోగా, వారిలో 120 మంది ఆదివారం స్థానిక గుండా కళ్యాణమండపంలో ఆత్మీయ కలయిక నిర్వహించుకున్నారు. దసరా సెలవులకు సుదూర ప్రాంతాల నుంచి భర్త, పిల్లలతో స్వగ్రామాలకు వచ్చిన వీరందరూ ఆదివారం బత్తలపల్లిలో సమావేశమై చిన్ననాటి కబుర్లతో ఆనందోత్సహాల మధ్య రోజంతా గడిపారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంతో ఆనందంగా గడిపారు. ప్రతీ ఏటా స్నేహితులందరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరి కష్టాల్లో మరొకరు పాలుపంచుకునే విధంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు షణ్ముఖరెడ్డి, నాగరత్నమ్మ, రామచంద్ర, అజయ్, మల్లయ్య, కొండన్న, విశ్వరూప, పాఠశాల స్థలదాత జక్కంపూడి సత్యనారాయణలను ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 'ఎంత ఎత్తుకు ఎదిగినా మీరు మా శిష్యులేనని, మీరు ఉన్నత స్థానాలను అధిరోహించాలని మీ కన్న తల్లిదండ్రులతో సమానంగానే మేము ఆశించామని,ఈ రోజు వివిధ రంగాల్లో మీరు రాణిస్తుండడం మాకు గర్వంగా ఉంద'ని అన్నారు. ఇద్దరు మిత్రురాళ్లు తమ భర్తలను కోల్పోవడాన్ని తెసుకున్న వారు వారి కుటుంబాలకు రూ. 80 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు లక్ష్మానాయుడు, రమేష్, జనార్దనాయుడు, చంద్రశేఖర్, శంకరయ్య, సురేంద్ర, సుబ్రమణ్యం, నారాయణస్వామి, కుమ్మర కలిసింహారెడ్డి, శంకరరెడ్డి, బోయపాడి సూర్యనారాయణ, కుమ్మర అదికారాయణ, బ్యాంకు కాశప్ప, రవి, కమతం సంగాలప్ప పెదయ్యతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో పూర్వ విద్యార్థులు

హిందూపురం : పట్టణంలోని ముదిరెడ్డిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో 1989–90లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 34 సంవత్సరాల అనంతరం పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ కలయికలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి హాజరు

మడకశిర : ఉమ్మడి జిల్లాలోని అనంతపురంలో ఆదివారం జరిగిన టిడిపి, జనసేన పార్టీ సమావేశానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి హాజరయ్యారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు ఉమ్మడి జిల్లాల జనసేన, టిడిపి సమావేశాన్ని అనంతపురంలో నిర్వహించారు. అందులో మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి, ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'యూనిటీ ఆఫ్ రన్'ను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ సమైక్యత దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పుట్టపర్తిలో ఈనెల 31న చేపట్టిన యూనిటీ ఆఫ్ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 31న మంగళవారం, ఉదయం 7 గంటలకు ఉజ్వల ఫౌండేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ దగ్గర నుండి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు యూనిటీ ఆఫ్ రన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, క్రీడాకారులు, యువకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు, పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

కరాటేలో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : అనంతపురం లోని అశోక్‌నగర్‌లో గల ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కరాటే అండర్ 14, 17, 19 విభాగం పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సెన్సేయి కరాటే శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చి వారిలో 50 మందిని వివిధ క్యాటగిరిలో పాల్గొనడానికి తీసుకు వెళ్లానన్నారు. ఇందులో నేహా, లిఖిత, తేజస్విని, గ్రీష్మ, యాసిని, రియాజ్, సయ్యద్, శ్రీ చరణ్, కార్తీక్, శోభన్, లోకేష్, హరీష్, ధనుంజయ, ధనుష్‌లు ప్రథమ స్థానాన్ని సాధించారన్నారు. భావన, మంజుశ్రీ, వేణుతేజ, ఆఫ్రిద్, జితేంద్ర, ప్రణీత్, హిమని ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభా విద్యార్థులకు పథకాలు, మెమోంటోలను అనంతపురం ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, సత్యసాయి జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ అంజన్న, ఎల్ నాగరాజు, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్, ఎస్ జి ఎఫ్ సిబ్బంది వేణుగోపాల్, మురారి యాదవ్, ఓబులేషు, కోటప్ప, శకుంతల, సిరాజ్‌ల చేతుల మీదుగా అందజేశారన్నారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే కరాటే స్కూల్ గేమ్స్ కు అర్హత సాధించారన్నారు.